సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



మెరుగైన వైద్యం అందించాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తుజాల్‌పూర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని తనిఖీ చేసి, వైద్య సేవల గురించి తెలుసుకున్నారు.

- IIలో ▸



వరి ఉత్పత్తిలో మనమే టాప్

రాష్ట్రంలో వరి ఉత్పత్తిలో బాన్సువాడ నియోజక వర్గమే మొదటి స్థానంలో ఉందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
29.7 /22.3

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రం పరిశీలన



భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో గురువారం పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 171 మంది విద్యార్థులకు గాను 169 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని పరీక్షల నియంత్రణ అధికారి సంపత్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ ఉన్నారు.

22న జిల్లా స్థాయి జూనియర్స్ ట్రయథ్లాన్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 22న ఉదయం 8 గంటలకు జిల్లా స్థాయి అండర్–14, 16, 18, 20 బాలబాలికల జూనియర్స్ ట్రయథ్లాన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఒక్కో పాఠశాల నుంచి ఒక్కో అంశంలో ఇద్దరు క్రీడాకారులకు మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు లేదా పుట్టిన తేది ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలని సూచించారు.

సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగుల నిరసన



కామారెడ్డి అర్బన్: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ శాఖ కామారెడ్డి డీఈ కల్యాణ్ చక్రవర్తిని ఉద్యోగులు ఘెరావ్ చేశారు. గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం ఆధ్వర్యంలో డీఈ కార్యాలయంలో నేలపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లుగా సమస్యలను పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆఫీసులో కనీసం మూత్రశాలలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. సమస్యల పరిష్కారానికి సీఎండీ, ఇతర ఉన్నతాధికారులు అనుకూలంగా ఉన్నా కామారెడ్డి, దోమకొండ, ఎల్లారెడ్డి డీఈలు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. 30 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని డీఈలు లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నిరసనలో 1104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు కమలాకర్, కార్యదర్శి శ్రీనివాస్, ప్రతినిధులు జగదీష్, పర్వయ్య, రాములు, కృష్ణమూర్తి, నర్సింలు, రవీందర్ పాల్గొన్నారు.

సొసైటీల పాలక వర్గాల పదవీకాలం పొడిగింపు

నాగిరెడ్డిపేట: వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలాన్ని మరోమారు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఫిబ్రవరిలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా ఈ ఏడాది ఫిబ్రవరిలో పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం పదవీకాలాన్ని ఆరునెలలపాటు పొడిగించింది. ఆ గడువు గురువారంతో ముగియగా.. మరో ఆరు నెలలపాటు పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది.

నిజాంసాగర్‌లోకి 2,334 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం 2,334 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటమట్టం 1,405అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. గురువారం సాయంత్రానికి 1,393.50 అడుగుల (5.863 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 2.969 టీఎంసీల వరద నీరు వచ్చి చేరిందని పేర్కొన్నారు. జూన్ నెలాఖరు వరకు 0.406 టీఎంసీ ఇన్‌ఫ్లో రాగా.. జూలైలో 0.899 టీఎంసీ, ఆగస్టులో ఇప్పటివరకు 1.392 టీఎంసీల నీరు వచ్చిందని తెలిపారు. సింగూరు ప్రాజెక్టు వరద గేటు ఎత్తి నీటిని విడుదల చేస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు మరింత వరద వచ్చే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

'కల్యాణి'లోకి 230 క్యూసెక్కులు..

ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డి శివారులోని కల్యాణి ప్రాజెక్టులోకి 230 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 అడుగులు కాగా.. 408.50 అడుగుల నీటిని ఉంచుతూ 230 క్యూసెక్కులను నిజాంసాగర్ మెయిన్ కెనాల్‌కు మళ్లిస్తున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మారాల్సిందెంతో!?

- పాలన వ్యవస్థలు అవినీతిరహితం కావాలి
- విద్య, వైద్యం, మహిళల భద్రత మెరుగుపడాలి
- వ్యవసాయం, రక్షణ రంగాలు మరింత బలపడాలి
- ప్రతి ఒక్కరికి సామాజిక న్యాయం దక్కాలి
- అప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందుంటుంది
- 'వందేళ్ల భారతం ఎలా ఉండాలి' 'సాక్షి' టాక్ షోలో యువత మనోగతం



మాట్లాడుతున్న సాందీపని కళాశాలల డైరెక్టర్ బాలాజీరావు

కామారెడ్డి క్రైం/కామారెడ్డి అర్బన్: వందేళ్ల భారతావనిని ప్రపంచంలో అగ్రగామిగా చూడాలంటే రానున్న రోజుల్లో వ్యవస్థాపరంగా, సామాజికంగా ఇంకా ఎన్నో మార్పులు రావాల్సిన అవసరం ఉందని యువత పేర్కొంది. దేశ స్వాతంత్య్ర శతాబ్ది ఉత్సవాలకు సమీపిస్తున్న నేపథ్యంలో 'వందేళ్ల భారతం ఎలా ఉండాలి' అనే అంశంపై 'సాక్షి' జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో గురువారం టాక్ షో నిర్వహించింది. ఇందులో యువత పాల్గొని తమ మనోగతాన్ని సాక్షితో పంచుకుంది. కొంతకాలంగా పలు రంగాల్లో అభివృద్ధి, మార్పు కనిపిస్తున్నప్పటికీ పాలనా వ్యవస్థల్లో అవినీతి, ఓటు బ్యాంకు రాజకీయాలు ఇప్పటికీ దేశాన్ని పట్టి పీడిస్తున్నాయనే అభిప్రాయాన్ని చాలామంది వ్యక్తం చేశారు. సాంకేతికతలో దేశం ముందంజలో ఉన్నా విద్య, వైద్యం, మౌలిక వసతులు, వ్యవసాయం, దేశ రక్షణ తదితర ముఖ్యమైన రంగాలకు మరిన్ని మెరుగులు దిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య అందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు మహిళల వ్యక్తిగత, సామాజిక భద్రతకు పెద్దపీట వేయాలని సూచించారు. ప్రతి పనిలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్నారు. అలా లేకపోవడం వల్లే చాలా సందర్భాల్లో వనరుల దుర్వినియోగం జరిగి దేశ ప్రగతి వెనక్కి నెట్టబడుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అవినీతిని అంతం చేసి ప్రతిభకు పట్టం కట్టాలని, అన్ని రంగాల్లో మార్పు కోసం ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరారు. తద్వారా సామాజిక న్యాయం జరిగి ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సాక్షి ప్రతినిధి వేణుగోపాలచారి, ప్రతినిధులు సత్యనారాయణ, సురేష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్న ఆలోచనల్లోంచే పెద్ద ఆవిష్కరణలు

యువత చేసే చిన్న ఆలోచన దేశాభివృద్ధిలో పెద్ద ఆవిష్కరణ అవుతుందని సాందీపని కళాశాలల డైరెక్టర్ బాలాజీరావు పేర్కొన్నారు. సాధారణ డిగ్రీ చదివి ఐఏఎస్‌లు అయిన వారెందరో ఉన్నారన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సాంకేతిక దేశాభివృద్ధికి తోడ్పడతాయని పేర్కొన్నారు. ఓటమి అంటే ప్రయత్నం చేయకపోవడమనే విషయాన్ని యువత గుర్తించాలని సూచించారు. విచ్చలవిడితనం, ఊహలనుంచి సహజమైన జీవితానికి అలవాటుపడాలన్నారు. సామాజిక మాధ్యమాలను అవసరం మేరకు మాత్రమే ఉపయోగించుకోవాలని, తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని ఆ రంగంలో ఉన్నత స్థానాలకు చేరుకేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.

అభివృద్ధిలో పోటీపడాలి



ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటే మనం సోషల్ మీడియాలో ముందున్నాం. వారు సాంకేతికంగా ముందుంటున్నారు. మనం కూడా సోషల్ మీడియాను పరిమితంగా వాడాలి. అభివృద్ధిపై దృష్టి సారించాలి. వంటిల్లు అనేది వైద్యశాలగా ఉండాలి. – ఆర్.ప్రీతి, డిగ్రీ విద్యార్థి

అవకాశాలు పెంచాలి



కొత్త ప్రపంచం కోసం యువత ఏకం కావాలి. ప్రభుత్వాలు విద్యార్థులకు సాంకేతిక, పరిశోధన అవకాశాలు పెంచాలి. చైనాలో విద్యార్థులే రాకెట్ ప్రయోగం చేశారు. మనం కూడా అ స్థాయికి ఎదగడానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలి.

– జే.జీవిత, డిగ్రీ విద్యార్థి

అవినీతికి అడ్డుకట్ట వేయాలి



ప్రభుత్వ పరిపాలనలో అవినీతి పెరిగిపోయింది. కింది నుంచి పైస్థాయి వరకు అందరూ లంచాలు లేనిదే పనిచేయడం లేదు. అవినీతిపరులపై కఠిన చర్యలుండాలి. ప్రజలు సైతం ఆత్యాశకు పోయి తమ పనులు చక్కబెట్టుకోవడానికి లంచాలు ఇస్తు మోసపోతున్నారు.

– జ్ఞానేశ్వర్, డిగ్రీ విద్యార్థి

ప్రభుత్వం ప్రోత్సహించాలి



సరైన విద్య అందించడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ప్రతిభ ఉన్న వారిని గుర్తించి ప్రోత్సహించాలి. మంచి విద్య అందిస్తే విద్యార్థులు బాగా చదువుకుని దేశాభివృద్ధికి తోడ్పడుతారు.

– నిఖిల్, డిగ్రీ విద్యార్థి

వ్యవ'సాయం' చేయాలి..



వ్యవసాయం దండుగ కాదు.. పండుగ చేయాలి. యువత వ్యవసాయం, దేశరక్షణలో భాగం కావాలి. ఆధునిక వ్యవసాయంలో యువతను ప్రోత్సహించాలి. వ్యవసాయంలో ఉపాధి అవకాశాలు పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. – కే.నితిష, డిగ్రీ విద్యార్థి

సహకారం అవసరం..



మహిళల కలల సాకారం చేయడంలో తల్లిదండ్రులు, ప్రభుత్వ సహకారం అవసరం. ఆడపిల్లలకు అందుబాటులో నాణ్యమైన విద్య ఉండాలి. ఉన్నత సాంకేతికతతో దేశాభివృద్ధిలో వేగం పెరుగుతుంది.

– మహిజబీన్, డిగ్రీ విద్యార్థి




స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవాలకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో అధికారులు వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం జరిగే సమావేశంలో ఆయన ప్రసంగిస్తారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతుల ప్రదానం, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకావిష్కరణ జరుగుతుంది. 9.40 గంటలకు జిల్లా పురోగతిపై ముఖ్య అతిథి ప్రసంగం, 10.10 గంటలకు అతిథులు, అధికారుల పరిచయం, 10.20 గంటలకు శకటాల ప్రదర్శన, 10.40 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 11.10 గంటలకు ప్రశంసాపత్రాల ప్రదానం కార్యక్రమాలు ఉంటాయని అధికారులు తెలిపారు. 12 గంటలకు వందన సమర్పణతో కార్యక్రమం ముగుస్తుందని పేర్కొన్నారు.



ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాట్లు

అవినీతే అసలు సమస్య!



- స్వేచ్ఛ, సమానత్వం అంతంతే...
- చట్టసభలు నిజాయితీగా పనిచేయాలి
- 'సాక్షి' సర్వేలో ప్రజలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ''దేశంలో అవినీతి అనేది పెద్ద సమస్యగా మారింది. అవినీతి అంతమైతేనే ముందుకు వెళ్లగలుగుతాం. స్వతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే చట్టసభలు నిజాయితీగా పనిచేయాల్సిన అవసరం ఉంది'' అని వివిధ వర్గాలు అభిప్రాయపడ్డాయి. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 'సాక్షి' సర్వే నిర్వహించింది. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య గురించి 30 మందిని అడిగితే 18 మంది అవినీతి గురించే చెప్పారు. పేదరికం గురించి ఆరుగురు, ఇతర సమస్యల గురించి మరో ఆరుగురు వివరించారు. కుల వివక్ష, వైద్యం గురించి ఎవరూ ప్రస్తావించలేదు. స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే చట్టసభలు, అధికార యంత్రాంగం మరింత నిజాయితీగా పనిచేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ అంశంలో మీడియా గురించి ఎవరూ ప్రస్తావించలేదు.

నాణ్యమైన విద్య అందించాలి



విద్యా వ్యాపారం అయిపోయింది. పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు లక్షల రూపాయల ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వమే అందరికీ ఉచితంగా నాణ్యమైన విద్య అందించాలి. పాఠశాలల సంఖ్య పెంచాలి. ప్రజల్లో కూడా మార్పు రావాలి.

– వి.పూజ, డిగ్రీ విద్యార్థి

ఉన్నత లక్ష్యంతో సాగాలి



వికసిత్ భారత్ లక్ష్యంగా అందరు పని చేయాలి. న్యాయం, చట్టాల గురించి అందరికీ తెలిసేలా విద్యా విధానం ఉండాలి. తప్పు చేస్తే జరిగే నష్టాలు ప్రతిఒక్కరికి తెలిసేలా ప్రచారం చేయాలి. యువత ఉన్నత లక్ష్యంతో పనిచేస్తే ప్రపంచంలో మనమే ముందుంటాం.

– పి.సాత్విక, డిగ్రీ విద్యార్థి

ప్రతిభకు పట్టం కట్టాలి



అగ్రకులాల్లో ప్రతిభ ఉన్న వారికి సరైన ఉద్యోగ అవకాశాలు రావడంలేదు. ప్రతిభకు పట్టం కట్టాలి. కులాలకు అతీతంగా ప్రతిభను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలుండాలి.

– ఎం.వైష్టవి, డిగ్రీ విద్యార్థి

మార్పులు రావాలి



ఆడపిల్లలను వేధించే వారిపై కఠిన చర్యలుండాలి. బాధితులకు ప్రభుత్వపరంగా అండ, సత్వర న్యాయం అందించాలి. విద్యా వ్యవస్థలోనూ మార్పులు రావాలి. పిల్లలపై పాఠశాల పుస్తకాల సంచి బరువును తగ్గించాలి. – లలిత, డిగ్రీ విద్యార్థి

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్ ఎస్పీ రాజేశ్ చంద్ర, అధికారులు

- వీసీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లు, అధికారులతో మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేశామన్నారు. అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కి పిలిపించాలని సూచించారు.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం

జిల్లాలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంత్రితో పేర్కొన్నారు. జిల్లాలో 43 లోలెవెల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలు ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, గ్రామపంచాయతీ, పోలీస్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వరద పరిస్థితిని సమీక్షిస్తున్నామని పేర్కొన్నారు. అవసరం ఉన్నచోట్ల బాధితులకు వసతి కల్పించడం కోసం పాఠశాలలు, గ్రామపంచాయతీ భవనాలు, ఫంక్షన్ హాళ్లలో రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేశామని వివరించారు. వీసీలో ఎస్పీ రాజేశ్ చంద్ర, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్ పాల్గొన్నారు.

దారి దోపిడీ ముఠా అరెస్ట్

కామారెడ్డి క్రైం: రోడ్డుపై వెళ్తున్న కంటెయినర్ లారీలోకి రన్నింగ్‌లోనే చొరబడి సెల్‌ఫోన్లు, హెడ్‌సెట్ బాక్సులను ఎత్తుకెళ్లిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

గతనెల 11న తెల్లవారుజామున కామారెడ్డికి సమీపంలోని టేక్రియాల్ వద్ద హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న ఓ కంటెయినర్ దారి దోపిడీకి గురైంది. బైక్‌పై వచ్చిన దుండగులు కంటెయినర్ రన్నింగ్‌లో ఉండగానే కట్టర్లతో సీల్ కట్ చేసి తలుపులు తెరిచి సినీ ఫక్కీలో లోనికి చొరబడి, దాదాపు రూ.8 లక్షల విలువైన ఫోన్లు, హెడ్‌సెట్‌ల బాక్సులను దొంగిలించారు. లారీని ఆపి డ్రైవర్ అడ్డుకోబోగా అతడిని చాకుతో బెదిరించి పరారయ్యారు. డ్రైవర్ ఫిర్యాదుతో దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను మధ్యప్రదేశ్ రాష్ట్రం దేవాస్ జిల్లాకు చెందిన ప్రదీప్ హుండా, విమల్ సిసోడియా, రితిక్ జాంజా, బలరాం జాంజా, మాలివ్యయా దీపక్ కుమార్, దేవిసింగ్ సిసోడియాలుగా గుర్తించారు. వారిలో రితిక్ జాంజా, దీపక్ కుమార్, దేవిసింగ్ సిసోడియాలను గురువారం అరెస్టు చేసి విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. ప్రధాన నిందితులు ప్రదీప్ హుండా, విమల్ సిసోడియాలు పరారీలో ఉన్నారన్నారు. నిందితుల వద్ద నుంచి చోరీకి ఉపయోగించిన వస్తువులు, ఓ బైకు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు ఛేదనలో విశేషంగా కృషి చేసిన కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రంజిత్, మాచారెడ్డి ఎస్సై అనిల్, సిబ్బంది రవికిరణ్, రామస్వామి, అరుణ్, బందగి, శ్రీనివాస్, లక్ష్మీకాంత్‌లను అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

తగ్గిన రోడ్డు ప్రమాదాలు..

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలతో జిల్లాలో గతేడాదితో పోలిస్తే ఈసారి 7 నెలల కాలంలో యాక్సిడెంట్లు గణనీయంగా తగ్గాయని ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. గతేడాది మొదటి 7 నెలల్లో 170 ప్రమాదాలలో 179 మంది మరణించారని పేర్కొన్నారు. ఈ యేడాది ఇప్పటివరకు 129 ప్రమాదాలు జరగ్గా 135 మంది మరణించారని తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి 41 రోడ్డు ప్రమాదాలు, 44 మరణాలు తగ్గాయని వివరించారు. ప్రమాదాలను అరికట్టడం కోసం జిల్లా పోలీసు శాఖ చేస్తున్న కృషిని డీజీపీ జితేందర్ ప్రశంసించారని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 154 సెల్‌ఫోన్‌ల రికవరీ

కామారెడ్డి క్రైం: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వారం రోజులపాటు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ ద్వారా జిల్లాలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 154 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామని ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. వాటి విలువ దాదాపు రూ. 26 లక్షలు ఉంటుందన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సీఈఐఆర్ విధానంలో ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 3,705 సెల్‌ఫోన్‌లను రికవరీ చేశామన్నారు. రికవరీలో ప్రతిభ చూపిన బృందం సభ్యులను ఎస్పీ అభినందించారు. ఫోన్‌లు పోగొట్టుకున్నవారు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఆర్ఎస్సై బాల్‌రాజు(8712686114) ను సంప్రదించి తమ సెల్‌ఫోన్‌లు తీసుకువెళ్లాలని సూచించారు.

క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



రామారెడ్డి: జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. రామారెడ్డి పీఎస్ పరిధిలో గంగమ్మ వాగును గురువారం ఎస్పీ రాజేశ్‌చంద్ర సందర్శించారు. వర్షాలతో సమస్యలు తలెత్తిన చోట డయల్ 100 లేదా కంట్రోల్ రూమ్ నంబర్ 08468–220069కి కాల్ చేసి సహాయం పొందాలని తెలిపారు. ఎస్పీ వెంట రామారెడ్డి ఎస్సై లావణ్య ఉన్నారు.

లెండి వాగులోకి వరద



మద్నూర్(జుక్కల్): మండలంలోని గోజేగావ్ గ్రామ శివారులోని లెండి వాగు జలకళ సంతరించుకుంది. వానకాలం ప్రారంభం అయినప్పటి నుంచి సరిగ్గా వర్షాలు కురవక పోవడంతో లెండి వాగులో చుక్క నీరు చేరలేదు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లెండి వాగులో వరద నీరు సందడి చేస్తోందని గ్రామస్తులు తెలిపారు. గురువారం మండలంతో పాటు ఎగువన ఉన్న మహారాష్ట్రలో సైతం వర్షాలు కురవడంతో లెండి వాగుకు వరద పోటెత్తింది. వాగులోని నీటి ప్రవాహంలో జాలరులు చేపలు పట్టారు.

ఊరంతా ఒక్కటై.. మద్య నిషేధానికి జై

- స్వచ్ఛందంగా మద్య నిషేధం అమలు
- ఆదర్శంగా నిలుస్తోన్న పలు గ్రామాలు

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 78 ఏళ్ల గడుస్తున్నా ఎక్కడా మద్యపాన నిషేధం అమలు కావడం లేదు. గ్రామ పెద్దలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల చొరవతో జిల్లాలోని కొన్ని గ్రామాల్లో మద్యపాన నిషేధం అమలవుతుంది.79వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆగ్రామాలపై ప్రత్యేక కథనం.

12 ఏళ్లుగా మద్యపాన నిషేధం అమలు చేస్తున్న సురాయిపల్లి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పెద్దలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించొద్దని తీర్మానించారు. సురాయిపల్లి గ్రామస్తులు గత 12 ఏళ్లుగా సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తున్నారు. మూడేళ్ల క్రితం శెట్పల్లిసంగారెడ్డి, మెంగారం గ్రామాలు మద్యం విక్రయాలు నిలిపివేశాయి. ఈఏడాది కొత్తగా సజ్జన్‌పల్లి, పోతాయిపల్లి, కేశాయిపేట, అన్నారెడ్డిపల్లి, పర్మళ్ల గ్రామాలు సైతం స్వచ్ఛందంగా మద్య నిషేధం అమలు చేస్తున్నాయి. బెల్టు షాపులు, కిరాణం దుకాణాల్లో మద్యం విక్రయాలు నిలిపివేయాలని ఆంక్షలు విధించారు. ఈనిబంధనలు అతిక్రమిస్తే రూ. 50,000 నుంచి రూ.లక్షవరకు జరిమానా విధించాలని తీర్మానించారు.

గతేడాది నవంబర్ నుంచి బొమ్మన్‌దేవ్‌పల్లిలో..



బొమ్మన్‌దేవ్‌పల్లిలో తీర్మానం చేసిన గ్రామస్తులు (ఫైల్)

నస్రుల్లాబాద్ : మండలంలోని బొమ్మన్‌దేవ్ పల్లి గ్రామంలో 2024 నవంబర్ నుంచి మద్యం నిషేధం అమలు చేస్తున్నారు. గ్రామంలో ఎవ్వరైనా మద్యం అమ్మితే జరిమానా విధించాలని గ్రామస్తులు తీర్మానించారు. యువతను మద్యం నుంచి దూరంగా ఉంచితే మద్యానికి బానిసగా మారకుండా ఉంటారని గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామంలో మద్యం అమ్మితే రూ.లక్ష జరిమానా విధించడంతో పాటు పట్టించిన వారికి రూ.25 వేల పారితోషికం అందిస్తూ పకడ్బందీగా అమలు చేస్తున్నారు.

ఈఏడాదిఫిబ్రవరి నుంచి బండారెంజల్‌లో...

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని బండారెంజల్ గ్రామంలో 2025 ఫిబ్రవరి నుంచి మద్యపాన నిషేధం కొనసాగుతుంది.మద్యం మత్తులో వాహనాలు అదుపుతప్పి ప్రమాద బారినపడుతున్నారు. అందరి మద్దతుతో గ్రామంలోకి మద్యం తీసుకురావొద్దు, విక్రయించొద్దని తీర్మానం చేశారు. గత ఆరు నెలల నుంచి మద్యం నిషేధం కొనసాగుతుంది.

గతేడాదిసెప్టెంబర్ నుంచి ఆజామాబాద్‌లో..



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని ఆజామాబాద్‌లో 2024 సెప్టెంబర్ నుంచి గ్రామస్తులు మద్యం అమ్మకాలు నిషేధిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం విక్రయిస్తే రూ. 50 వేల జరిమానా విధిస్తామని గ్రామస్తులు తీర్మానం చేశారు. గ్రామస్తులు చేసిన తీర్మానానికి అందరు ఇప్పటి వరకు కట్టుబడి ఉన్నారు.

ఈఏడాది జూన్ నుంచి కొండాపూర్, గుండారం గ్రామాల్లో..



కొండాపూర్‌లో తీర్మాన పత్రాన్ని చూపుతున్న గ్రామస్తులు (ఫైల్)

రాజంపేట: మండలంలోని కొండాపూర్, గుండారం జీపీ పరిధిల్లోని బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలను నిషేధిస్తూ 2025 జూన్‌లో ఇరు గ్రామాల ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే వారికి రూ. లక్ష జరిమానాతో పాటు 7 చెప్పుదెబ్బలని తీర్మానంలో పేర్కొన్నారు. గ్రామంలో మద్యం అమ్మిన వారి సమాచారం తెలిపితే రూ. 10 వేల పారితోషకం అందిస్తామని, అదే విధంగా సంబంధిత వ్యక్తి పేరు గోప్యంగా ఉంచుతామని తీర్మానంలో వివరించారు.

స్వాతంత్య్ర పోరులో పిట్లం వీరులు







స్వాతంత్య్ర పోరులో పాల్గొన్న పిట్లం వీరుల ఫ్లెక్సీ, బాన్సువాడ తహసీల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన శిలాఫలకం, పిట్లంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం

- జ్ఞాపకార్థంగా బాన్సువాడ తహసీల్ ఎదుట శిలాఫలకం ఏర్పాటు
- తామ్రపత్రం ఇచ్చి సత్కరించిన అప్పటి భారత ప్రభుత్వం

పిట్లం(జుక్కల్): స్వాతంత్య్ర సమర పోరాటంలో పిట్లం గ్రామానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అప్పటి నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ డివిజన్ పరిధిలో 8 మంది స్వాతంత్య్ర సమరయోధులు ఉండగా, వారిలో 7 గురు పిట్లం గ్రామానికి చెందిన వారు కావడం విశేషం. వీరిలో నీలకంటి లోక నారాయణ, నీలకంటి లోక లక్ష్మయ్య, ఉప్పు లక్ష్మయ్య, గంగా నాగయ్య, కొండ నారాయణ, వంజరి బాలరాజు, కుమ్మరి లక్ష్మారెడ్డి ఉన్నారు. ప్రస్తుతం వీరెవరు బతికిలేరు. వీరిలో నీలకంటి లోక నారాయణ పిట్లం సర్పంచ్ గా పని చేశారు. గ్రామంలోని పాత గడి హనుమాన్ ఆలయం నుంచి పోలీస్ స్టేషను వరకు కాలి బాటగా ఉన్న రోడ్డు ను వెడల్పు చేసిన ఘనత, గ్రామానికి మొదటిగా విద్యుత్ తెచ్చిన ఘనత ఈయనకు దక్కింది. ఇతని సోదరుడు నీలకంటి లోక లక్ష్మయ్య తహసీల్దార్ గా పదవి విరమణ చేసినంతరం అన్నతో కలిసి పోరాటంలో పాల్గొన్నారు. ఉప్పు లక్ష్మయ్య పిట్లం గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. అప్పట్లో తెలంగాణ విమోచన కోసం, రజాకారులకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. అప్పటి భారత ప్రభుత్వం వీరందరికి తామ్ర పత్రం ఇచ్చి సత్కరించింది. ఇప్పటికి బాన్సువాడ తహసీల్ కార్యాలయం ఎదుట శిలాఫలకంపై వీరి పేర్లు ఉండటం విశేషం. వీరి జ్ఞాపకార్థం గ్రామంలో ప్రధాన కూడలిలో గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారు. ఈకూడలిలో వీరి తదనంతరం వారి వారసులు జెండా ఎగురవేస్తున్నారు.

పిట్లం అనే పేరు ఇలా వచ్చింది

స్వాతంత్య్ర సమర పోరాటం జరుగుతున్న సమయంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా రహస్యంగా పిట్లంకు చెందిన సమరయోధులు రహస్యంగా యువకులచే ఒక పటాలం (గ్రూప్)ను ఏర్పాటు చేశారు. వీరందరికి రామ మందిరం వద్ద శిక్షణ ఇచ్చేవారు. పటాలం అనే పేరు కాలక్రమంలో మార్పుచెంది గ్రామానికి పిట్లంగా పేరు వచ్చింది.

తండ్రి ఆశయాన్ని కొనసాగిస్తూ..

- సదాశివనగర్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న తనయుడు
- 48 ఏళ్లుగా ఆదర్శంగా నిలుస్తోన్న వైనం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద సాయిలు అనే ఓ వృద్ధుడు గత 48ఏళ్లుగా జనవరి–26, ఆగస్టు–15న జాతీయ జెండాను ఎగుర వేస్తూ వచ్చాడు. 83 ఏళ్ల వయస్సులో అనారోగ్యంతో 2023లో ఆయన తుదిశ్వాస విడిచాడు. తండ్రి ఆశయ సాధనకు కృషి చేస్తామని కుమారుడు చెప్పడంతో గ్రామస్తులు కూడా ఒప్పుకున్నారు. 2023–ఆగస్టు 15, 2024 జనవరి–26న సాయిలు కుమారుడు మోహన్ రాజ్ జెండాను ఆవిష్కరించారు. సదాశివనగర్ మండల కేంద్రంలో 1975లో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి 15 మంది సభ్యులు ఒక సంఘంగా ఏర్పడ్డారు. ఆ సంఘానికి సాయిలు ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. గాంధీ విగ్రహం ఏర్పాటుకు కృషి చేసిన సాయిలుతోనే జెండాను ఆవిష్కరింపజేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు నిర్ణయించుకున్నారు.అప్పటి నుంచి జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్నారు.









రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



ఎడ్ల కట్ట వాగును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

బీబీపేట: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం ఆయన తుజాల్‌పూర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. భారీ వర్షాలు, వరద ముప్పుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, నెలలు నిండిన గర్భిణులను డెలివరీ కోసం ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు ముందుగానే చేయాలని ఆదేశించారు. అవసరమైన ఇతర మౌళిక సదుపాయాల గురించి తగిన ఏర్పాట్లు చేయాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌కు సూచించారు. అనంతరం జనగామ, మాందాపూర్ గ్రామాల మధ్యనున్న ఎడ్ల కట్ట వాగు లోలెవల్ బ్రిడ్జిని పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో వరదలు ముంచెత్తితే వాహనాల రాకపోకలను కట్టడి చేయాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, వైద్యాధికారి శిరీష, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, తహసీల్దార్ గంగాసాగర్, ఎస్సై ప్రభాకర్ పాల్గొన్నారు.

పెద్ద చెరువు పరిశీలన

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువును కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం సాయంత్రం ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం చెరువు నీటి మట్టం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోల గురించి తెలుసుకున్నారు. అలుగు పైనుంచి ప్రజలు వెళ్లకుండా బారికేడ్లను పెట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ మల్లేష్, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్, ఈఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెరువులో మునిగి యువకుడి మృతి

ఎల్లారెడ్డి: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ శివారులో గల ఊర చెరువులో ఓ యువకుడు నీట మునిగి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా.. జాన్కంపల్లి ఖుర్దు గ్రామానికి చెందిన మూడ్ పూల్యా(45) జీపీ మల్టీ పర్పస్ వర్కర్‌గా విధులను నిర్వహిస్తుండేవాడు. గ్రామంలోని ఊర చెరువు మీదుగా వచ్చే విద్యుత్ తీగలు తెగిపోవడంతో గ్రామానికి చెందిన విద్యుత్ శాఖ లైన్‌మెన్, విద్యుత్ ఆపరేటర్లు చెరువులోని విద్యుత్ స్తంభానికి మరమ్మతుల కోసం పూల్యాను తీసుకువెళ్లారు. ప్రమాదవశాత్తు పూల్యా నీటిలో మునిగి మృతి చెందడంతో లైన్‌మెన్, ఆపరేటర్లు పూల్యా మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం వారు పోలీసు స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..



బోరంచ లచ్చయ్య(ఫైల్)

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా.. మండలంలోని తాండూర్‌కు చెందిన బోరంచ లచ్చయ్య (20)కు భార్య లావణ్యతో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతుండేవి. దీంతో ఆమె రాఖీపండగ సందర్భంగా బాన్సువాడలోని తన పుట్టింటికి వెళ్లింది. అంతకుముందు ఆమె భర్త లచ్చయ్యపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అతడు మనస్తాపం చెంది ఈ నెల 12న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీఆస్పత్రికి తరలించగా బుధవారం రాత్రి చికిత్స పొందుతూ లచ్చయ్య మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

చీనూర్‌లో మరొకరు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని చీనూర్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన దాసరి సంజీవులు(47) కొన్ని రోజుల క్రితం ఆర్థికపరమైన విషయమై కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపం చెంది అతడు ఈనెల 11న రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వడ్లం గ్రామంలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని వడ్లం గ్రామంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో పురుగుల మందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామనికి చెందిన మంతోల సుభాష్ (35) గురువారం సాయంత్రం సమయంలో మద్యంమత్తులో పురుగుల మందు తాగి పోలీస్ స్టేషన్ వెళ్లాడు. వెంటనే పోలీసులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందినట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు.

కాలువలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఉన్న కాలువలో గుర్తుతెలియని వ్యక్తి పడి మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై అంజనేయులు గురువారం తెలిపారు. సదరు వ్యక్తి వయస్సు 35 సంవత్సరాల వరకు ఉంటుందని, అతడు జాతీయ రహదారిపై అటుఇటు తిరిగేవాడని, ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉంటాడన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

పోక్సో కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు

కామారెడ్డి క్రైం: పోక్సో కేసులో ఒకరికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ మండలం కొల్లూరు గ్రామానికి చెందిన కల్లూరి మహేశ్ ఓ బాలికకు మాయ మాటలు చెప్పి ఇంట్లోకి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడినట్లు 2021 నవంబర్ 4న కేసు నమోదైంది. మహేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.70 వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు. నిందితుడికి శిక్షపడేలా కేసు విచారణ జరిపిన, సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ రాజేశ్‌చంద్ర అభినందించారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత



కామారెడ్డి క్రైం: తల్లిదండ్రులను వెతుక్కుంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లి తప్పిపోయిన నాలుగేళ్ల చిన్నారిని పోలీసులు గుర్తించి తల్లికి అప్పగించారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్ కాలనీలో నివాసం ఉండే కడమంచి జానకి, నరసింహులు దంపతులకు నాలుగేళ్ల కుమార్తె లాస్య ఉంది. లాస్య ఇంట్లో ఆడుకుంటుండగా దంపతులిద్దరూ ఇప్పుడే వస్తామని బయటకు వెళ్లారు. బాలిక తల్లిదండ్రులను వెతుక్కుంటూ బయటకు వెళ్లి తప్పిపోయింది. దంపతులు ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించారు. పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరి ఆధ్వర్యంలో సిబ్బంది సీసీ కెమెరాలు పరిశీలించడంతోపాటు ఓ పాల వ్యాపారి ఇచ్చిన సమాచారంతో బాలికను సమీపంలోని మరో కాలనీలో గుర్తించి తల్లికి అప్పగించారు. రెండు గంటల్లోనే చిన్నారి ఆచూకీ గుర్తించిన పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన లారీ



ఎల్లారెడ్డి: మండలంలోని బొగ్గుగుడిసె శివారులో ఆటోను లారీ ఢీకొనడంతో పొదల్లోకి దూసుకెళ్లినట్లు స్థానికులు గురువారం తెలిపారు. ఎల్లారెడ్డి నుంచి నిజాంసాగర్ వైపునకు వెళ్తున్న ఆటోను హైదరాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

అందరికీ 'సంక్షేమం' బాధ్యత అధికారులదే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భిక్కనూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైన ఉందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం భిక్కనూరు రైతు వేదికలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైన ఉద్యోగుల విధులకు ఆటకం కలిగిస్తే చూస్తూ ఉరుకోబోమన్నారు. నిబంధనలను తుంగలో తొక్కాలని లొత్తిడి తీసుకువచ్చిన వారి భరతం పడతానని హెచ్చరించారు. డిసెంబర్ నాటికి తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించి రెండెళ్లు పూర్తి అవుతాయని, అప్పటిలోగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందకుంటే ఊరుకునేది లేదని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, ఏఈ సంకీర్త్, ప్రభుత్వ వైద్యురాలు యెమీమా తదితరులు పాల్గొన్నారు.

'వరి ఉత్పత్తిలో మనమే టాప్'



మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: రాష్ట్రంలో వరి ఉత్పత్తిలో బాన్సువాడ నియోజికవర్గమే మొదటి స్థానంలో ఉందని ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుడ్మిలో రూ. 26 లక్షలతో నిర్మించిన సొసైటీ గోదాంను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ జాకోర, జలాల్‌పూర్ ప్రాంతాలకు నిజాంసాగర్ కాల్వల ద్వారా నీటిని అందించేందుకు రూ. 300 కోట్లతో సిద్దాపూర్ రిజర్వాయర్ ప్రాజెక్ట్ పనులు చేపడుతున్నామన్నారు. వ్యవసాయ గోదాంలతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకురుతుందన్నారు. ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, నాయకులు గంగారాం, మధుసూదన్‌రెడ్డి, నాందేవ్, గోపాల్‌రెడ్డి, పిట్ల శ్రీధర్, ఎజాజ్, అంజిరెడ్డి, గురు వినయ్, సుధాకర్‌గౌడ్, ఖమ్రు, గోపాలకృష్ణ, వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

బెజుగంచెరువుతండాలోనే జీపీ భవనాన్ని నిర్మించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బెజుగంచెరువుతండాలోనే గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించాలని కోరుతూ తండావాసులు గురువారం ఎంపీడీవో ప్రభాకరచారికి వినతిపత్రాన్ని అందజేశారు.గ్రామపంచాయతీ నూతనంగా ఏర్పడినప్పటి నుంచి తమ తండాలోనే పంచాయతీ కార్యాలయం కొనసాగుతుందని వారు చెప్పారు. తమ తండాలో గల సర్వే నం.171లోనే గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు పనులు చేపడితే ఏర్రకుంట తాండవాసులు అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు. బెజుగంచెరువుతండా గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు పలుమార్లు తండాపెద్దల సమక్షంలో మాట్లాడినా సమస్య పరిష్కారం కావడంలేదన్నారు.

ప్లకార్డులతో కాంగ్రెస్ నాయకుల నిరసన



లింగంపేట(ఎల్లారెడ్డి): లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అరెస్టుకు నిరసనగా గురువారం లింగంపేట అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ దొంగ ఓట్లు వేయించుకొని గద్దెనెక్కినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణాగౌడ్, కాసిఫ్, రాజేశ్వర్‌గౌడ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సంఘాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలి

తాడ్వాయి : గ్రామాలలోని మహిళా సంఘాలు అన్ని రకాల అభివృద్ధి చెందాలని సీసీ గంగారెడ్డి అన్నారు. మండలంలోని కరడ్‌పల్లి గ్రామంలో గురువారం గ్రామ సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు సంఘాలకు సంబందించి రికార్డులను పరిశీలించారు. ఆర్థిక లావాదేవిలపై చర్చించారు. ప్రతినెల 10వ తేదీ లోపు శ్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు చెల్లించేలా తీర్మానాలు చేశారు. కొత్తగా వృద్ధుల సంఘాలు, వికలాంగుల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వీవోఏలు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్సు ద్వారా రక్షణ పొందాలి

ఎల్లారెడ్డిరూరల్: యువకులు 18 ఏళ్లు నిండిన తర్వాత బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని, బీమా చేయించుకోవాలని ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ సనత్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని మత్తమాల గ్రామంలో బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్క ఖాతాదారుడు పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై ఇన్సూరెన్సు చేసుకొని రక్షణ పొందాలన్నారు.

హోటళ్లపై సివిల్ సప్లయ్ అధికారుల దాడులు



స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో అధికారులు

కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రంలోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్‌లలో డొమెస్టిక్ సిలిండర్లను వాడుతున్నారని ఫిర్యాదులు రావడంతో గురువారం సివిల్ సప్లయ్ అధికారులు దాడులు నిర్వహించారు. గృహ అవసరాలకు వాడాల్సిన డొమెస్టిక్ సిలిండర్లను నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార అవసరాలకు వాడుతున్న 6 హోటళ్లపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్‌వో స్వామి తెలిపారు. 53 సిలిండర్లను జప్తు చేశామన్నారు. డీటీలు సురేష్, కిష్టయ్య, ఖలీద్, ఖాజా, తిరుపతి ఉన్నారు.